


సుప్రభాతం వచ్చేవేళ కాదది.

అయినా సుప్రభాతం వినబడుతున్నది.

'ఓసేవ్! ఆ స్టీలు గిన్నెకు అన్ని సొట్టలు పడ్డాయేమిటే?'

'ఛీ...ఛీ. వెధవ పిల్లి ఒక్కక్షణం కనుమరుగైతే చాలు, అన్నిటిలో మూతిపెడుతుంది.'

'ఒరేయ్ వెంకాయ్! అయ్యగారికి బాత్ రూములో వేడినీళ్లు పెట్టు!'

యుద్ధం నామీద ప్రారంభమయ్యింది.

'ఎనిమిదయింది...ఇక లేవండి మహానుభావా!'

'మీ కేకలకు గంటక్రితమే నిద్రాదేవి పారిపోయిందే' — అందామనుకున్నాను అనలేకపోయాను. ఇప్పుడేకాదు...కనీసం రోజుకు వెయ్యిసార్లయినా యేదో అనాలనుకొని, మా ఆవిడముందు అనలేకపోతుంటాను.

టూత్ బ్రష్ నోట్లో పెట్టుకుని బాత్ రూమువైపు నడిచాను. మామూలుగా కాదు. మగపురుషుడిలా కాదు తలవంచుకొని బాత్‌రూములోకి వెళ్లాను. నేను తల వంచుకొని వెళ్ళటం మా శ్రీమతికిష్టం. తలెత్తుకుని యింట్లో తిరిగితే మరదలు పిల్లనో, పని మనిషినో చూస్తున్నాననంటుంది. మరదలు పిల్లకు పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోతే, పనిమనిషిని మాన్పించి ఇంట్లో పని నేను చేస్తేగాని నాకీకష్టాలు తప్పవు... ఖర్మ. నా ఖర్మ...

స్నానంచేసి పేపరు చదవటం మొదలు పెట్టాను. పెళ్ళాం కేకలు వినబడుతున్నాయి... బజారుకువెళ్ళి కూరగాయలు తీసుకురావాలట..... ఖర్మం... ఒక్కక్షణం ఖాళీగా కూర్చోనివ్వదుకదా!......హెడ్‌లైన్స్ చూడాలి!......

'ఆకలి చావులు లేవని మంత్రి ఉద్ఘాటన... శ్రీ 'మీర్జా' వ్యాఖ్యలపట్ల ఆంధ్రులనిరసన.. ప్రధాని పథకంపై చెన్నారెడ్డి వ్యాఖ్య... 'తెలుగునాడు'గా పేరు మార్చాలని అధ్యాపకుల సూచన...కనబడుటలేదు...కావలెను.. రంజీట్రోఫీ...'

రెండోసారి పేపరు తిరగేశాను ..'ఆకలి చావులులేవని మంత్రి ఉద్ఘాటన ... తల్లీ కూతుళ్ళ ఆత్మహత్య...'

'తల్లీ కూతుళ్ల ఆత్మహత్య'

విజయవాడ, నవంబరు 20.

మాచ్యాపేటకు చెందిన 'శాంతమ్మ',



దీర్ఘ రోగులకు

ఉత్తమ వైద్యము

పుంసకత్వము, శుక్ల నష్టము, స్వప్నదోషము, సుఖవ్యాధులు, ఆస్తమా, క్షయ, (దమ్ము), కోరింత దగ్గు, మలబద్ధకము, చెవుడు, కడుపునొప్పి, కుష్టు, చర్మ వ్యాధులకు పోస్టుద్వారాకూడా వైద్యము చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల. డా: పి. కుమారస్వామి: రేపర్ వి. బి. రోడ్, అనాలి. ఫోన్ 551. బ్రాంచి 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు—17

35 సం॥ అనుభవం

వరిబీజము బుడ్డలు బీజకుట్లు మొదలగు వ్యాధులకు ఆపరేషన్ లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును


రే అండ్ క్రా ఆసుపత్రి

గౌలిగూడ సియ బస్ డిపో ఎదురుగ. రామ్ మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర.

ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544

బేబీటోన్

గ్రైప్ మిక్స్చర్




బంగారు బేబీ యేడాదే, ఇంతలోనే ఆరు పళ్లు వచ్చేశాయి. ఎంతో సరదాగా వున్నాడు ఆరోగ్య సూచకమైన ఆకలి గాడ వి(రపోతాడు. కాని కడుపునొప్పి? అది తగ్గటం ఎంతో సేపు కాదులెండి బేబీటోన్ గ్రైప్ మిక్స్చర్ కు ధన్యవాదాలు

ప్యాకిన్స్ ABC వారి ఉత్పత్తి

అమర్ శోభ పోస్టు బాక్స్ 518, మద్రాసు 3 పోస్టు బాక్స్ 16460 బొంబాయి-16


# దారితప్పిన..

ఆమె కూతుళ్ళు 'రమ', 'ఉమ' ఆత్మహత్య చేసుకున్నారు. కారణం తెలియటంలేదు. నిద్రమాత్రలు మింగినట్లు తెలుస్తుంది. 'శాంతమ్మ కొడుకు 'కిషోర్' ఆరు సంవత్సరముల క్రితం ఇల్లువదిలి పారిపోయినట్లు తెలుస్తుంది

చేతిలో పేపరు జారిపోయింది.

మనస్సంతా గజి, బిజిగా వుంది... 'కిషోర్'...'కిషోర్'...ఎవరో పిలుస్తున్నారు! తనకు పరిచయమున్న కిషోరేనా?...... సందేహంలేదు అతనే ..అతను వ్రాసిన ఉత్తరంలో అక్కయ్యల పేర్లు వ్రాశాడు.. ఆ ఉత్తరం చూడాలి!

పాత పుస్తకాల పెట్టె వెతికాను.

ఉత్తరం దొరికింది.

మనస్సు గతంలోకి జారుకుంది ..

*   *   *

'ఇండోర్'లో నేను ఎం. ఏ. చదివే రోజులు. మొదటిసారి ఇండియన్ కాఫీ హౌస్ దగ్గర 'కిషోర్'ను చూశాను. అతనిగూర్చి స్నేహితులద్వారా తెలుసుకున్నాను.

'కిషోర్' చామనచాయగా, సన్నగా, పొడుగ్గా వుంటాడు ఎడమకన్ను కొద్దిగా మెల్లనుకుంటాను ఆకర్షణీయంగానే వుంటాడు. నెల్లూరు ప్రాంతంనుంచి పారిపోయి వచ్చాడట. కారణం ఏమిటో ఎవ్వరికీ తెలియదు. కలుపుగోలు వ్యక్తి...

మరోసారి 'ప్రియపాల' దగ్గర కనిపించాడు. కొంతమందిని చూడగానే వారి మీద అభిప్రాయ లేర్పడతాయి. 'కిషోర్' నాకు అమాయకుడిలా, మంచివాడులా కన్పించాడు. పరిచయం చేసుకోవాలనుకొన్నాను. 'బోటు' కదలబోతుంది. అర్ధరూపాయిచ్చి నేను, రమేష్ బోటు ఎక్కాము 'కిషోర్' కూడ ఎక్కమని పిలిచాను. 'పనుందంటూ' వెళ్లిపోయాడు.

ఆదివారం రోజు 'కాంచిమహల్' చూడాలనుకొని రైల్వేస్టేషన్ దగ్గర కెళ్లినప్పుడు అక్కడ కన్పించాడు. స్టేషను దగ్గర యెప్పుడు టెంపోలు, ఆటోరిక్షాలు టాంగాలు గుమిగూడి వుంటాయి. స్టేషన్ దగ్గర టెంపో ఎక్కి 'కాంచిమహల్' చేరుకోవచ్చు.

'మల్హార్ గంజ్ కి'

'సలాసియా'

'రాజవాడ!'

పెద్దగా కేకలు పెడుతున్నాడు 'కిషోర్'. మెడచుట్టూ స్కార్ఫ్ చుట్టుకున్నాడు. పాత జెర్కిన్ తొడుక్కున్నాడు. జుట్టంతా మొహం మీద పడుతున్నది.

'ఆప్ కిధర్ జానేవాలా సాబ్?' చిరునవ్వు నవ్వుతూ అడిగాడు. నన్ను సరిగ్గా గుర్తు పట్టలేదట్లుంది, తెలుగులో మాట్లాడాను గుర్తుపట్టాడు.

'కాంచిమహల్ చూడాలని బయలుదేరాను నాకు నీతోడు కావాలి.'

కొన్ని క్షణాలు ఆటపాయించాడు. దగ్గరలో వున్న 'టెంపో దగ్గరకు వెళ్లి డ్రైవర్ తో యేదో మాట్లాడాడు. 'కిషోర్' చేతిలో రూపాయినోటు పెట్టాడు. నవ్వుకుంటూ నా దగ్గర కొచ్చాడు. ఇద్దరం యింకో టెంపో యెక్కాము. ఆ టెంపో 'రాజవాడ' దాకా వెళ్తుతుంది. అక్కడనుంచి పదడుగులు వేస్తే 'కాంచిమహల్' చేరుకోవచ్చు. మేమిద్దరం ఒక యింకా నల్గురు ఎక్కారు. వాళ్లు తలకుచుట్టుకున్న కాషాయరంగు తలపాగాల వంక, మాసిపోయిన మందపాటి దుస్తులను, దుమ్ము కొట్టుకున్న హాఫ్ షర్ట్స్ వంక మార్చి మార్చి చూడసాగాను 'ఇండోరు'లో పాశ్చాత్య నాగరికత, మన నాగరికత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఒకప్రక్క ఎయిర్ కండిషన్డ్ బార్ లు, రెస్టారెంట్లు పది అంతస్తుల మేడలు, మరో ప్రక్క పడిపోయేటట్లు వుండే యిళ్లు వుంటాయి. సూటు, బూటు వేసుకు తిరిగే జనం—నెత్తిమీద గుడ్డల మూటలతో, మాసిపోయిన దుస్తులతో, చాలా దైన్యంగా ప్రజలు కన్పిస్తారు 'ఇండోరు' మధ్య ప్రదేశ్ లో పెద్ద పట్టణమయినా యింకా వెనుకబడి వుందనే చెప్పాలి.

ఓవర్ బ్రిడ్జి దాటి ముందుకు దూసుకుపోతుంది 'టెంపో'. కిషోర్ మౌనంగా కూర్చున్నాడు. అతన్ని గూర్చి తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువయ్యింది.

'ఏం పని చేస్తున్నావ్?'

చిన్నగా నవ్వాడు, నవ్వితే బాగుంటాడని పించింది.

"ఒకటికాదు ... రెండుకాదు ... బతుకు

తెరువుకు యెన్నో మార్గాలున్నాయి సార్! స్టేషను, బస్స్టాండు దగ్గరనుంచి లాడ్జికి ప్యాసింజర్ను తీసుకువెళ్లితే రూపాయిస్తారు లాడ్జి ప్రొప్రైటర్స్. టెంపోల దగ్గర నిలబడి కేకలు పెడితే ట్రిప్కు అర్ధ రూపాయిస్తారు. సినిమాథియేటర్స్ దగ్గర బ్లాక్ని టిక్కెట్లు అమ్మితే కనీసం ఐదు రూపాయిలు మిగులుతాయి...యింకా చెప్పా లంటే చాలా వున్నాయిసార్! అవన్నీ చెప్ప గూడనివి!'

చెప్పగూడనివి యేమిటో తెలుసుకోవా లనిపించింది.

'రాజవాడ' చేరుకోవటంతో నా ప్రశ్నలు నాలోనే యిమిడిపోయాయి. రాజవాడభవనం ముందు దిగాము.

హోటల్కు తీసుకెళ్లాను. నాలుగు సమోసాలు, 'పూరీ' ఆత్రంగా తినేశాడు. నా ఆసక్తి మళ్లీ బయటపడింది.

'కిషోర్! మీదేవూరు?'—'టీ' త్రాగుతూ అడిగాను.

'గూడూరు'...పూరీ తిని 'పానీలావ్!'—అంటూ కేకేశాడు.

'ఇక్కడ కెందుకొచ్చావ్?'

'కిషోర్' మాట్లాడలేదు. యేమిటో చూడటం మొదలుపెట్టాడు. చెప్పటం యిష్టంలేదని గ్రహించాను. మళ్లీ అడగ లేదు.

'కాంచిమహల్' దగ్గర కెళ్లాము. సాయంత్రం అయిదవుతుంది. ఆ గాజు మందిరం తలుపులు వేయబోతున్నారు. 'వాచ్మాన్'ని బ్రతిమాలి లోపలి కెళ్లాం, అంతకు ముందోసారి ఆ జైనుల దేవా లయాన్ని చూశాను. మళ్లీ మళ్లీ చూడా లనిపిస్తుంది. 'ఇండోరు'కు వెళ్లిన వాళ్లెవ్వరూ 'కాంచిమహల్' చూడకుండా రారు. కొన్ని కోట్లు వెచ్చించి జైనులు ఆ మందిరాన్ని కట్టించారు. ఆ మందిరం గోడలు, తలుపులు రంగు రంగుల గాజు ముక్కలతో నిర్మించారు. ధగ, ధగా మెరిసే ఆ గాజు మందిరంలో ప్రశాంతంగా, అర్ధ నిమీలిత నేత్రాలతో కూర్చున్న 'మహా వీరుని' మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది:

వాచ్మాన్ టైం అయిపోయిందని గొడవ చెయ్యటంతో తొందరగ బయట పడ్డాం.

నాతోపాటు 'కిషోరు' ఐ. ఏ. కాలేజి హాస్టల్దాకా వచ్చాడు. ఐదురూపా లివ్వ బోయాను.

తీసుకోలేదు. అర్జంటు పనుందంటూ వెళ్లిపోయాడు.

* * *

మళ్లీ చాలారోజులకుగాని 'కిషోర్'కనబడ లేదు

యేదైనా ఇంగ్లీషు పిక్చరు చూడాలని పించింది. 'బాంబినో' థియేటరులో 'ది వే వెస్ట్' ఆడుతుంది. చాలా రష్గా వుంది. టికెట్స్ దొరకవేమో ననుకున్నాను. తిరిగి వెళ్లిపోదామనుకునే సమయంలో 'కిషోర్' కన్పించాడు.

'కిషోర్ క్షణంలో టికెట్లు సంపాదించాడు. నేను బలవంతం చెయ్యటంతో నావెంట వచ్చాడు. 'ఇంటర్ మిషన్' వరకు యిద్దరం యేంమాట్లాడుకోలేదు. బయిట కొచ్చి 'హాట్డాగ్'లు తిన్నాం. కిషోర్ 'టీ' త్రాగుతూ ప్రక్కవాళ్లతో హిందీ ధారాళంగా మాట్లాడుతున్నాడు.

'కిషోర్! నీకు హిందీ బాగావచ్చిందే!'—హాలులోపలకు వస్తూ అన్నాను.

'నాల్గేళ్లయ్యింది సార్ యిక్కడకొచ్చి. ఆ మాత్రం రాకపోతే యెలా బ్రతుకుతాను'

'ఐతే ఆంధ్రలో బ్రతకలేక యిక్కడి కొచ్చావా?' అసలు విషయంలోకి లాగాలని నా ప్రయత్నం.

'బతుకంటే యేమిటో తెల్సుకోవాలనే వచ్చానండీ'

'యిక్కడకు రావాల్సినవసరం లేదే!'

'............'

'కిషోర్! నువ్వు బాధపడనంటే నొక్క విషయం అడుగుతాను. నువ్వెందుకు మధ్య ప్రదేశ్ వచ్చావ్?'


'............'

మళ్లీ పిక్చర్ మొదలయింది.

పిక్చర్ వదిలిం తర్వాత 'జనతా'కెళ్లి భోంచేశాము.

'ఈరోజు మీకు కొత్త 'ప్లేస్' చూపిస్తాను వస్తారా?'—అడిగాడు పాన్ నములుతూ.

'కిషోర్'గూర్చి పూర్తిగా తెల్సుకోవా లనే నా పట్టుదల అతనివెంట నడిపించింది. 'బాంబే బజారు'కు తీసుకువెళ్లాడు. చిన్న డాబాముందు నన్ను నిలబెట్టి, తను లోపలి కెళ్లాడు. రెండు నిముషాల్లో బయిటకొచ్చి నాతో రెండేరెండు మాటలన్నాడు. అసలు సంగతర్థమయ్యింది. 'కిషోర్' చెయ్యిపట్టుకొని అక్కడనుంచి లాక్కొచ్చేశాను. నేను ప్రవరాఖ్యుడినని కాదుగాని, సుఖవ్యాధు లంటే భయం.



కొత్త ఖాతాదారుని తీసుకువస్తే 'కిషోర్'కి రెండు రూపాయి లిస్తారట. క్షమాపణ చెప్పుకొన్నాడు. ఆ రాత్రి నారూమ్‌లోనే పడుకొన్నాడు.

మరునాటి ఉదయం వెళ్లిపోయాడు. అదే ఆఖరిసారి 'కిషోర్'ను చూడటం.

*  *  *

ఆ తరువాత రెండు నెలల్లో కిషోర్ కన బడలేదు. 'రమేష్' నడిగాను. 'కిషోర్'తో నాకున్న పరిచయంకూడ 'రమేష్'కు లేదు. 'ఇండోర్'లోని ఆంధ్రులెవ్వరూ 'కిషోర్' గూర్చి చెప్పలేదు. చాలమందికి కిషోరెవరో తెలియదట.

రెండు నెలల తరువాత 'కిషోర్'దగ్గర నుంచి ఉత్తరం వొచ్చింది. పోస్టల్ స్టాంపు చూస్తే 'చండీఘర్' అని వుంది. అడ్రెస్ వ్రాయలేదు.

'గౌరవనీయులైన

రామకృష్ణగారికి, కిషోర్ నమస్కరించి వ్రాయునది.

మీ ఆదరణకు పరవశించిపోయాను. చివరకు మీకు బందీనవుతానేమోనని భయ వేసింది. ఒకరిదగ్గర కట్టుబడి వుండటం నాతరం కాదు. నేను స్వేచ్ఛా జీవిని. గమ్యం తెలియక తిరుగుతున్నాను.

నాది నెల్లూరు ప్రాంతమని అందరికి చెప్పాను. పరిక్ష తప్పటం కారణంగా

## దారితప్పిన...

యిల్లు వదిలి వచ్చానని చాలమందితో అన్నాను. కానీ అది నిజం కాదు. కొన్ని చేదు నిజాలను మీకు చెప్పా లనిపించింది. హృదయభారాన్ని తగ్గించు కోటానికైనా మీకు చెప్పాలి...

మాది విజయవాడ. చాల బీద కుటుం బంలో పుట్టాను. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నాను, బాల్యం బీదరికంలోనే గడిచింది. తిండిలేక పస్తులున్న రోజులు ఎక్కువగా వుండేవి. అష్టకష్టాలు పడు తూనే మా అమ్మ నన్ను యస్. యస్. యల్. సి. వరకు చదివించింది. 'రమ', 'ఉమ' అనే యిద్దరక్కయ్యలున్నారు నాకు. ...రోజులు గడుస్తున్నాయి.

......నాకు తెలియకుండానే మా యింట్లో పరిస్థితులు మారిపోయినై. అక్కయ్యలు విలాసజీవితానికి అలవాటు పడ్డారు. పదిరూపాయలు కావాలంటే నా చేతిలో పాతికరూపాయలు పడేవి. నేను వద్దంటున్నా నన్ను పి. యు. సి. లో జేర్పించారు. నేను ఒక్కడినే కావటంతో మా అమ్మకు, అక్కయ్యలకు నేనంటే ప్రాణం.

కాలేజిలో నన్ను సూటి, పోటీ మాట లతో బాధించటం మొదలుపెట్టారు స్నేహితులు. అసలు విషయం బోధ పడింది. అమ్మతో పోట్లాట పెట్టు కున్నాను. 'ఇంత డబ్బు యెక్కడనుంచి వస్తున్నదని?' నిలదీసి అడిగాను. నామాట లెవ్వరూ లెఖ్కచెయ్యలేదు. ఆరోజు నుంచి దాపరికంగా జరిగేవి బహిరంగంగానే జర గటం మొదలైనాయి. ఒకరోజు రాత్రి మా అక్కయ్యతో కులుకుతున్న పెద్ద మనిషిని పట్టుకు కొట్టాను. నేను కన బడందే ఒక్కక్షణం వుండలేని అమ్మ, అక్కయ్యలు ఆరోజు నుంచి నన్ను వేరే యింట్లో వుండమన్నారు.

నా మనస్సు విరిగిపోయింది. కాకుల్లా పొడిచే సంఘానికి దూరమవ్వాలనుకొన్నాను.

నాలుగు సంవత్సరాలనుండి దూరంగా వుంటున్నాను.

కానీ మాష్టారూ! దరిద్రానికి దూరం కావాలనుకొని అక్కయ్యలు దారి తప్పారు. నా అక్కయ్యలే కాదుసార్! అక్కయ్యలాంటి వాళ్ళు బీదరికం పుచ్చుల్లో బిగిసిపోయి, తమ జీవితాలను బజారుపాలు చేసుకున్న వాళ్ళను చాలమందిని చూశాను. అక్కయ్య లను సక్రమమార్గంలో పెట్టే శక్తి నాకు లేదు. నేనూ దారి తప్పాను! నాకు లేని అలవాటు లేదు.

ఏమిటోసార్ ! దారి తెన్నూ లేకుండా తిరగాలనిపిస్తున్నది. తెగిన గాలిపటంలా తిరుగుతున్నాను...

గుర్తుంచుకోదగిన వ్యక్తిని కాను.

నన్ను మర్చిపొండి.

—కిషోర్.

'కిషోర్' నన్ను మర్చిపోయే వుంటాడు. 'కిషోర్'ని నేను మర్చిపోలేను ... మర్చి పోలేను...

*  *  *

కిందపడి గాలికి రెపరెపలాడుతున్న ఉత్తరాన్ని భద్రంగా చేతిలోకి తీసు కున్నాను.

కనుగొలనులో నీళ్ళు నిలచాయి.

"ఏమండోయ్! మిమ్మల్నే! త్వరగా లేచి బజారు వెళ్ళిరండి! కూరగాయలు నిండుకున్నాయి."

సుడిగాలిలా వచ్చింది శ్రీమతి సత్యా దేవి.

చేతిలో ఉత్తరం కొట్టుకుపోతుందేమో నని భద్రంగా పట్టుకున్నాను. ●

